నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 29 మార్చి 2025 | ADILABAD NIRMAL

## రాంపూర్ పాఠశాలలో తాగునీటి కష్టాలు

తాంసి, మార్చి 28 : ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో ఉన్న బోరుబావి అడుగంటింది. పాఠశాల ఆవరణలోనే మిషన్ భగీరథ ట్యాంక్ ఉన్నప్పటికీ, నీటి సరఫరా లేక పోవడంతో ఇంటి నుంచి బాటిళ్లలో నీటి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిళ్లను చూపిస్తున్న విద్యార్థులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

ఇచ్చోడ, మార్చి 28 : ఇచ్చోడ మండలకేంద్రంలో జరుగుతున్న ప్రధాన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. శుక్రవారం ఇచ్చోడలో రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని కోరారు. వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, ముండే పాండురంగ్, దేవేందర్ రెడ్డి, నానక్ సింగ్, అభిరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో జోగు రామన్నకు పండు తినిపిస్తున్న ముస్లింలు

## రంజాన్‌కు తోఫా ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

**ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, మార్చి 28 : మైనార్టీ కుటుంబాలు రంజాన్‌ను ఘనంగా నిర్వహించేలా పండుగకు తోఫాను అందించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో ముస్లింలు, మత పెద్దలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జోగు రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనను మైనార్టీ నాయకులు సత్కరించారు. అనంతరం వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మైనార్టీ సంక్షేమానికి రూ.17 కోట్లను వెచ్చించి మసీదుతోపాటు కబ్రస్థాన్‌లను, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేఆర్‌కే కాలనీలో కబ్రస్థాన్‌తోపాటు లైబ్రరీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాజిదొద్దీన్, అజార్, అక్బర్, ముబారక్, షాదుల్లా, ఖయ్యూం, దేవుదాస్, మున్నా పాల్గొన్నారు.




ఆదిలాబాద్ పట్టణంలో హోటల్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

## కుళ్లిన మాంసం.. కిచెన్‌లో బొద్దింకలు

- హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- రెండు హోటళ్లకు రూ.10 వేల చొప్పున జరిమానా

ఆదిలాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : రోజుల తరబడి నిల్వ చేసిన మాంసం..కిచెన్ అపరిశుభ్రతతో బొద్దింకలు తిరిగే దృశ్యాలు ఆదిలాబాద్ పట్టణంలోని హోటళ్లలో మున్సిపల్ శానిటరీ విభాగం అధికారుల తనిఖీల్లో వెలుగుచూశాయి. ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం మామ్స్ హోటల్‌తో పాటు వెంకటేశ్వర స్వీట్‌హౌస్‌లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, శంకర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. హోటళ్లలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లలో ఫ్రిజ్‌లలో చాలా రోజులుగా నిల్వ ఉంచిన చికెన్, మటన్, చేపల మాంసాన్ని గుర్తించారు. వంటశాలలో ఆహారంపై బొద్దింకలు తిరుగుతున్నాయని తెలిపారు. వినాయక్ చౌక్‌లోని వెంకటేశ్వర్ స్వీట్ హౌస్‌లో ఫ్రిజ్‌లో చాలా రోజుల క్రితం తయారు చేసిన స్వీట్లు నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. హోటల్‌తో పాటు స్వీట్‌హౌస్‌కు రూ.10 వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. హోటళ్ల యజమానులు నిబంధనల పాటించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



హోటల్‌లో నిల్వ ఉంచిన మాంసం, ఇతర ఆహారపదార్థాలు

# అంతంతే సర్కారు వైద్యం

**బేల దవాఖానలో వైద్యులు, సిబ్బంది కొరత**

- అందుబాటులో లేని మందులు
- సరైన సదుపాయాలు లేక రోగులకు అవస్థలు





నిరుపయోగంగా ఉన్న రక్తపరీక్షల పరికరం



మూసిఉన్న ల్యాబ్



బేలలోని ఐకేపీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ దవాఖాన



ల్యాబ్ టెక్నీషియన్ లేక గర్భిణి నుంచి పరీక్షల కోసం రక్తం సేకరిస్తున్న స్టాఫ్ నర్స్

బేల, మార్చి 28 : గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో మెరుగైన వైద్య సేవలందించిన ప్రభుత్వ దవాఖానలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 'నేను రాను..బిడ్డో సర్కార్ దవాఖాన'కు అనే పరిస్థితికి వచ్చాయని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా బేల ప్రభుత్వ దవాఖాన నిలుస్తున్నదని చెప్పవచ్చు. దవాఖానలో వైద్యుల కొరత, సరైన మందులు లేక, ల్యాబ్ టెస్టులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రైవేట్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదని మండిపడుతున్నారు. మరో వైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ అందుబాటులోకి తేకపోవడంతో ఐకేపీ భవనంలోనే అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నది. బేల మండలంలోని 52 గ్రామాలకు ఉన్న ఒక్క దవాఖానలోనూ సరైన సదుపాయాలు లేక పోతే పరిస్థితి ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాత్రి సమయంలో పురిటి నొప్పులతో వచ్చిన నిండు గర్భిణి పడ్డ అవస్థలను చూసి దవాఖాన అంటేనే జంకే పరిస్థితి వచ్చిందని విమర్శలు వస్తున్నాయి.

### సగం సిబ్బందితోనే..

పీహెచ్‌సీలో డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. 24 గంటల పాటు అందుబాటులో ఉండాల్సిన డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఒక్క డాక్టర్‌కు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆయన ప్రతిరోజూ ఉదయం వచ్చి మధ్యాహ్నమే జిల్లా కేంద్రానికి వెళ్లిపోవడంతో రోగులకు సరైన వైద్యం అందక ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తున్నది. పర్మినెంట్ స్టాఫ్ నర్స్ ఒక్కరే ఉన్నారు. ముగ్గురు కాంట్రాక్టు సిబ్బంది ఉన్నారు. ఫార్మసిస్టులు ఇద్దరికి గాను ఒక్కరే ఉన్నారు. జిల్లా కేంద్రానికి 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ పీహెచ్‌సీకి ప్రతి రోజూ 100 పైగా రోగులు వస్తుంటారు. అందులో 20 నుంచి 22 మందికి దవాఖానలో అడ్మిట్ చేసుకొని చికిత్స అందించాల్సి వస్తుంది. కానీ ఇక్కడ సరిపడా వైద్యులు, సిబ్బంది లేక పోవడంతో మెరుగైన వైద్యం అందడం లేదని రోగులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి 24 గంటలు అందుబాటులో ఉండేలా డాక్టర్లు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

### టెస్ట్ రిపోర్టు కోసం వారం రోజులు..

రక్త పరీక్షలు కోసం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని గర్భిణులు రోగులు వాపోతున్నారు. ఇక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఆమె తన పలుకుబడితో జిల్లా కేంద్రానికి డిప్యూటేషన్‌పై వెళ్లిందని ఆరోపణలున్నాయి. దీంతో సాధారణ జ్వరం, సీజనల్ వ్యాధులతో వచ్చిన వారికి బయట పరీక్షలు చేయించుకోవాలని సిబ్బంది చెబుతున్నారు. కొందరికి మాత్రం విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సులే రక్త పరీక్షల కోసం బ్లడ్ శాంపిల్స్ సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తున్నారు. ఆ పరీక్షలు రిపోర్ట్ రావడానికి వారం పడుతుందని అంటున్నారు. దీంతో గత్యంతరం లేక ప్రైవేట్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుందని రోగులు అంటున్నారు. వైద్యాధికారులు స్పందించి ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంచి పరీక్షలు ఇక్కడే జరిగే విధంగా చూడాలని కోరుతున్నారు.

### సిబ్బంది కొరత వాస్తవమే..



బేల దవాఖానలో సిబ్బంది లేకపోవడంతో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ విషయమై ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న సిబ్బందితోనే 24 గంటల పాటు దవాఖానలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాను. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. *- డాక్టర్ వంశీ కృష్ణ, పీహెచ్‌సీ, బేల*

# సీసీఐని అదానీకి కట్టబెట్టొద్దు

- కేంద్రమంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హామీలు నెరవేర్చాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఆదిలాబాద్, మార్చి 28 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను అదానీకి కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మానుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సూచించారు. శనివారం అఖిలపక్షం నాయకులతో కలిసి ఆయన ఆదిలాబాద్‌లో మూతపడిన సిమెంటు పరిశ్రమను సందర్శించారు. సీసీఐ ముందు పరిశ్రమను ప్రారంభించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ కేంద్ర మంత్రులు తాము అధికారంలోకి వస్తే సీసీఐని తిరిగి తెరిపిస్తామని హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ప్రస్తుతం ఏమీ మాట్లాడడం లేదన్నారు. పరిశ్రమకు 700 ఎకరాలను రూ.3 వేల చొప్పున రైతుల నుంచి సేకరించారని తెలిపారు. పరిశ్రమను మూసివేస్తున్నందున రైతులు తమ భూములు తిరిగి అప్పగించాలని కోరుతున్నారన్నారు. మరో వైపు సీసీఐని తెరిపించి ఉపాధి కల్పించాలని స్థానికులు కోరుతున్నారని తెలిపారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు రియల్ వ్యాపారం చేసి కోట్లు గడించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీసీఐపై పార్లమెంట్‌లో తమ ఎంపీలతో ప్రశ్నించేలా కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు సీసీఐని తెరిపించే ప్రయత్నాలు చేయాలని లేదంటే తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్, సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కో కన్వీనర్ విజ్జిగిరి నారాయణ, బండి దత్తాత్రి, లంకా రాఘవులు, కిరణ్, అజయ్ దాసరి రమేశ్, శివకుమార్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ , అఖిలపక్షం నాయకులు

# ఒకే నెలలో ఇద్దరు అధికారులు

- మార్చి నెలలో రెండు సార్లు ఏసీబీ దాడుల కలకలం
- అధికారుల తీరుతో ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు

ఆదిలాబాద్, మార్చి 28 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కొందరు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతున్నది. అధికారులు లంచం ఇవ్వనిదే పనులు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్చి నెలలోనే జిల్లాలో ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడ్డ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మాస్ మీడియా అధికారిగా పనిచేస్తున్న రవిశంకర్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇటీవల గుడిహత్నూర్ మండలం మన్నూర్‌లో ఓ బాలిక గర్భం దాల్చగా, ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు అబార్షన్ పిల్స్ ఇచ్చాడు. స్థానికంగా ఉన్న మెడికల్ షాపులో పిల్స్ విక్రయించినందున వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. మందులు విక్రయించిన మెడికల్ షాపు సంబంధించిన కేసులో జిల్లా మాస్ అధికారి విచారణ అధికారిగా ఉన్నారు. మందుల షాపు యజమానికి అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి రూ. 30 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అబార్షన్‌కు సంబంధించిన కేసుల్లో కఠినంగా వైద్యశాఖ అధికారులు నిబంధనలపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా వైద్య శాఖ అధికారి పిల్స్ విక్రయించిన వారికి అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి రూ. 30 వేలు డిమాండ్ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన వైద్యశాఖ మాస్ మీడియా అధికారి రవిశంకర్

### ఒకే నెలలో రెండు సార్లు దాడులు..

ఆదిలాబాద్ జిల్లాలో మార్చి నెలలో ఏసీబీ అధికారులు రెండు సార్లు దాడులు నిర్వహించారు. ఈ నెల 11న జిల్లా విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యూఐడీసీ) శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జిన్నంవర్ శంకర్ కాంట్రాక్టర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ నిర్మాణ సంస్థలో రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా దొరికిపోయాడు. తాజాగా శుక్రవారం జిల్లా మాస్ మీడియా అధికారి రవిశంకర్ రూ.30 వేల లంచం తీసుకుంటుండగా దొరికారు. జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల అధికారుల వేధింపులు భరించలేక బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఏసీబీకి రెడ్‌హ్యాండ్‌గా పట్టుపడుతున్నా లంచాల కేసులు వెలుగులోకి రావడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కలెక్టరేట్‌లో ముందస్తు ఉగాది ఉత్సవాలు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి, 28: నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం అధికారులు ముందస్తుగా ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ ప్రజలు, అధికారులకు ముందస్తు విశ్వావసునామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది నూతన సంవత్సరం నుంచి రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ అధికారులంతా జిల్లాను అన్ని రంగాల్లో ముందు నిలిపేలా కృషి చేయాలన్నారు. అధికారులకు, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళలు వేసిన ముగ్గులను తిలకించారు.



ఉగాది ఉత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## టీబీ నియంత్రణకు కృషి చేయాలి

ఎదులాపురం, మార్చి28 : టీబీ వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి వ్యాధి తీవ్రతను తగ్గించే అస్కారం ఉంటుందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వరల్డ్ టీబీ డే, వంద రోజుల టీబీ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వైరస్ కనుగొన్న ప్రొఫెసర్ రాబర్ట్ కోచ్ చిత్రపటానికి పూలమాల వేసి, కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. డాక్టర్ రామ అశోక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు గురు టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని వారికి క్షయ మిత్ర ద్వారా నిత్యావసర కిట్లను కలెక్టర్ ద్వారా పంపిణీ చేశారు. టీబీ వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై వైద్యసిబ్బందిని అభినందించారు. సర్టిఫికెట్లను అందించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డెరైక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, డీటీసీవో డాక్టర్ సుమలత, డిప్యూటీ డీఎంహచ్‌వో డాక్టర్ సాధన, అడిషనల్ డీఎంహెచ్‌వో గజానన్ పాల్గొన్నారు.



టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర కిట్లను అందజేస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్